ఎమ్మెల్సీ స్థానానికి ఒకే నామినేషన్

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటా నుంచి ఒక ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్‌ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఏడు రోజుల వ్యవధిలో అధికార కాంగ్రెస్‌కు చెందిన బసవనగౌడ బాదర్లి ఒక్కరు మాత్రమే మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఒకే అభ్యర్థి నామినషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఎన్నికైన జగదీశ్‌శెట్టర్ పార్టీ సభ్యత్వంతోపాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. బసవనగౌడ బాదర్లి ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు.



దేహదానానికి అంగీకారం తెలిపిన కొందరు గ్రామస్థులు

కేఎల్ఈ ఆసుపత్రిలో అవయవదానం విభాగం

సమాజ హితం కోసం.. దేహదానం

శేగుణసి వాసుల పెద్ద మనసు

ఒకే పల్లె నుంచి 185 మంది దేహదానానికి అంగీకారం
దేశానికే ఆదర్శంగా నిలిచిన గ్రామం

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ పరంపర, సంస్కృతి సంప్రదాయాలు పాటించే సమాజం మనది. జన్మకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో మృతి చెందాక అంతకుమించి సంప్రదాయాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. అభివృద్ధి చెందిన దేశాలు లేదా ఉన్నత హోదాలలో ఉండేవారు మాత్రమే దేహదానం (టోటల్ బాడీ డోనార్) చేస్తారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతం బెళగావి జిల్లా అథణి తాలూకా శేగుణసి గ్రామంలో ఏకంగా 185 మంది దేహదానానికి అంగీకార పత్రాలు అందించారు. గత కొంతకాలంగా గ్రామానికి చెందిన 17 మంది మృతి చెందగా వారి దేహాలను మెడికల్ కళాశాలకు అప్పగించారు. డాక్టర్ మహంతేశ్ రామణ్ణవర్ స్ఫూర్తితో గ్రామస్థులంతా స్వచ్ఛందంగా దేహదానానికి అంగీకరించారు. ఇక్కడి యువకులే కాకుండా మహిళలు కూడా ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన మాంతేశ్ సిద్ధనాళ మాట్లాడుతూ 2010లో జాతీయ బసవసేవాదళం ఏర్పాటైందన్నారు. దీని ద్వారానే యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశారని, డాక్టర్ మహంతేశ్‌రామణ్ణవర్ ముఖ్యులుగా వచ్చారన్నారు. దేహదానానికి సంబంధించి అవగాహన కల్పించడంతో అదేరోజు 108 మంది అంగీకారపత్రాలపై సంతకాలు చేశారని తెలిపారు. మృతి చెందాక శరీరం బూడిదకాకుండా మరొకరికి ఉపయోగపడాలనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇందుకు కుల, మత, పేద, ధనిక అనే వ్యత్యాసం లేదన్నారు. గ్రామస్థులు ఎవరైనా మృతి చెందితే సంప్రదాయ విధానాలు పాటిస్తామన్నారు. ఇందుకు స్థానిక స్వామిజీలు కూడా అంగీకారం తెలిపారని అన్నారు. బంధుమిత్రులు చివరిచూపు చూసి సంప్రదాయాలు ముగించాక మృతదేహాలను ఆసుపత్రికి అప్పగిస్తామని తెలిపారు. డాక్టర్ మహంతేశ్ రామణ్ణవర్ అవయవదానంపై మాట్లాడుతూ తమ తండ్రి బసవణ్ణప్ప డెంటిస్ట్‌గా పనిచేశారని, స్వాతంత్ర్య సంగ్రామంలోనూ పాల్గొన్నారని తెలిపారు. 2008 నవంబరు 13న మృతి చెందగా కేఎల్‌ఈ మెడికల్ కళాశాలకు దేహాన్ని దానం చేశామని వివరించారు. రెండేళ్ల తర్వాత తమ తండ్రి దేహాన్ని చూపుతూ వైద్యవిద్యార్థులకు పాఠాలు చెప్పానని వివరించారు.



డాక్టర్ మహంతేశ్ రామణ్ణవర్

ఇదే స్ఫూర్తితో బెళగావి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దేహదానానికి ముందుకొస్తున్నారని తెలిపారు. ఒకరి దేహదానం ద్వారా ఏడుగురి ప్రాణాలు కాపాడవచ్చునని, మెడికల్ విద్యార్థుల బోధనకు చాలా ఉపయోగపడతుందన్నారు. దేహదానంపై చైతన్యం కలిగించడంతో కేఎల్‌ఈ మెడికల్ కళాశాలకు ఐదు వేలమంది తమ దేహాలను దానం చేయడానికి అంగీకరిస్తూ రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికే 200 మంది దానం చేశారని అన్నారు. దేహదానం తర్వాత మృతదేహానికి మెడికోలు గౌరవం చెల్లించి ఆ తర్వాత అధ్యయనం చేసే ప్రక్రియ ప్రారంభిస్తారన్నారు. కేవలం కేఎల్‌ఈ మెడికల్ కళాశాలకే కాకుండా బెళగావి నుంచి రాష్ట్రంలోని పలు మెడికల్ కళాశాలలకు దేహాలను ఇస్తున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం శేగుణసి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మహంతేశ్ రామణ్ణవర్ పాల్గొన్నారు. మహాలింగపురంలో ఇటీవలే వందమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

కేంద్ర చట్టాల్లో లోపాలు

రాష్ట్ర వినతులను కేంద్రం పట్టించుకోలేదు
శాసనసభలో సవరణలు చేస్తాం
రాష్ట్ర న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పాటిల్



బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలు దేశవ్యాప్తంగా ప్రారంభమైన రోజే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈనెల 15 నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో మూడు కొత్త చట్టాల్లో సవరణలు తీసుకురానున్నట్లు రాష్ట్ర న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్రప్రభుత్వం భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ చట్టాలు తీసుకొచ్చిందన్నారు. మూడు క్రిమినల్ చట్టాల్లో లోపాలు ఉన్నాయని, దేశంలో పోలీసు పాలన ప్రారంభమవుతుందని మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఈ చట్టాలు స్వాతంత్ర్య పోరాట ఆశయాలు, ధ్యేయాలు, ప్రజాప్రభుత్వ విలువలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గత ఏడాది ఆగస్టులోనే మూడు చట్టాలపై అభిప్రాయాలు కోరుతూ లేఖ రాశారని తెలిపారు. ముఖ్యమంత్రి సూచన మేరకు న్యాయనిపుణుల కమిటీ ఏర్పాటు చేశామని, కమిటీ నివేదికను న్యాయశాఖ పరిశీలన తర్వాత కేంద్రానికి పంపామని వివరించారు. రాష్ట్రం నుంచి అభిప్రాయాలు, మార్పులకు సంబంధించిన వినతులను కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. చట్టానికి సంబంధించి పలు అంశాలపై స్పష్టమైన వ్యాఖ్యానాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. చట్టం రూపొందించిన ప్రభుత్వం ఆ వ్యవధిలోనే అమలు చేసేందుకు నైతికత ఉంటుందని, ప్రభుత్వ గడువు ముగిశాక చట్టాలను అమలులోకి తెచ్చే తేదీలను నిర్ధారించడం అనైతిక, రాజకీయ వ్యతిరేక చర్య అవుతుందన్నారు. చట్టం చేసినప్పుడు ఉన్న ప్రభుత్వ గడువు లోక్‌సభ ఎన్నికల ముగియడంతోనే పూర్తి అయిందన్నారు. కొత్త ప్రభుత్వం అమలులోకి వచ్చిన తర్వాత జూలై 1నుంచి చట్టాలను పరిగణనలోకి తీసుకోవాలనే సూచన సరికాదన్నారు. గురువారం జరిగే కేబినెట్‌లో వీటిపై చర్చిస్తామని అన్నారు. మూడు చట్టాలలోని 23 అంశాలను సవరణలు తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతామన్నారు. చట్ట సవరణలు చేసేందుకు రాష్ట్రానికి అధికారం ఉందని, రాజ్యాంగం ఆర్టికల్ 7 కాలం 3 ప్రకారం అధికారాన్ని ఉపయోగించి సవరణ చేస్తామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న అంశాలు

స్వాతంత్ర్య పోరాట విలువలకు స్వస్తి పలికారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేయడం నేరమని కొత్త చట్టం చెబుతోందని మంత్రి పాటిల్ తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడం నేరం కాదనేది సరికాదని, జాతిపిత, జాతీయ పతాకాలకు అవమానం చేసేవారిపై చర్యలకు అవకాశం లేదనేది సరికాదని అన్నారు. సంఘటిత నేరాలు ఆరోపించే వ్యక్తులపై కేసులు నమోదును పోలీసుల వివేచనకు కేటాయించడం తగదన్నారు. నిందితుల ఆస్తులు జప్తు చేయడంపై పోలీసులకు అధికారం ఉంటుందని, ఇంతకుముందు కోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉండేదని వివరించారు. జాతీయ భావనలకు భంగం కలిగిస్తే మూడేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానాగా విధించారని తెలిపారు. నిందితులు ఎవరైనా ప్రస్తుతం ఉన్న 15రోజుల పోలీస్ కస్టడీని 90రోజులకు పెంచారని పేర్కొన్నారు. మృతదేహాలపై అత్యాచారం తప్పుకాదని న్యాయం చెబుతోందని వ్యాఖ్యానించారు. మూడు కొత్త చట్టాలు అమలులోకి రావడంతో అంతకుముందు నమోదైన కేసుల పరిష్కారం దాకా పాత చట్టాలకు అనుగుణంగా విచారణ జరిపి శిక్షలు విధిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సవరణల ప్రక్రియ ప్రారంభించి ఉభయసభలలో అంగీకారం సాధించి రాష్ట్రపతి నుంచి అనుమతులు పొందేవరకు కొత్తచట్టాలు రాష్ట్రంలో అమలులోకి రావని తెలిపారు. ఈ చట్టాల ప్రభావం ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేమని, కొన్ని రోజుల తర్వాత తెలుస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

15 నుంచి శాసనసభ సమావేశాలు



బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈనెల 15 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం తీర్మానించింది. గత గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో శాసనసభ సమావేశాల తేదీపై ముఖ్యమంత్రే నిర్ణయం తీసుకుంటారని తీర్మానించారు. ఈ మేరకు మంగళవారం సీఎం సిద్దరామయ్య ఈనెల 15 నుంచి 26వరకు శాసనసభ సమావేశాలు కొనసాగేలా నిర్ణయించారు. గవర్నర్ అనుమతుల కోసం రాజ్‌భవన్‌కు సిఫారసు లేఖలు పంపారు. శాసనసభ సమావేశాల్లో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రధానంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, జలమండలి నుంచి నీటి పన్నులు, ఆస్తిపన్నులు పెంచాలని భావిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో 15రోజులపాటు శాసనసభ సమావేశాలు జరిగాయి. ఇదే సందర్భంలోనే సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

కృష్ణానదిలో నలుగురి దుర్మరణం

పేకాట ఆడుతుండగా పోలీసుల దాడి
నదిలో తెప్పపై తప్పించుకునే యత్నం
బోల్తాపడి ప్రమాదం

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విజయపురం జిల్లా కొల్హార తాలూకా బలూతి జాక్వెల్ సమీపంలో కృష్ణానదిలో తెప్ప మునిగి నలుగురు నీటిపాలైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. నది ఒడ్డున పేకాట ఆడుతున్న గుంపుపై పోలీసులు దాడికి యత్నించారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆరుగురు ఒడ్డున ఉండే తెప్ప ద్వారా నదిలోకి వెళ్లారు. నదిలో వెళుతుండగా జోరుగా గాలి వీయడంతో తెప్ప మునిగిపోయింది. ఇద్దరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరగా.. నలుగురు మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మరింత మంది పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలకు దిగారు. విజయపుర ఎస్పీ రుషికేశ సోనావణె, ఏఎస్పీ శంకర మారిహాళ సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతుల్లో పుండలీక యంకంచి (34) ఒకరిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్థులు పెద్దఎత్తున ఒడ్డుకు చేరుకుని రోదించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.


నది వద్దకు చేరుకున్న గ్రామస్థులు

స్వామీజీలకు మరేమీ పనిలేదా..?

ముఖ్యమంత్రుల మార్పు వారికెందుకు..?
మత మార్పిడులపై ఏమి చేశారు?
బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ ఆగ్రహం

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై పలువురు స్వామిజీల వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ తీవ్రంగా మండిపడ్డారు. స్వామిజీలకు మఠాలలో కూర్చోవడం తప్ప మరేమీ పనిలేదా అంటూ వ్యాఖ్యానించారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్‌ను క్రికెటర్లు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లితో పోల్చిన వచనానందస్వామిజీపై విరుచుకుపడ్డారు. బెంగళూరులో మంగళవారం యత్నాళ్ మీడియాతో మాట్లాడుతూ మఠాలలో ఉండే స్వామిజీలు ఆధ్యాత్మికత గురించి ఆలోచించాలని, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. మతమార్పిడులు జరుగుతున్నాయని, లవ్‌జిహాది సాగుతోందని వాటిపై స్వామిజీలు ఏం చేశారని ప్రశ్నించారు. ఇటువంటి సామాజిక అంశాలపై స్వామిజీలు పోరాడాలని, ముఖ్యమంత్రుల మార్పు వీరికెందుకని ప్రశ్నించారు.



గతంలో హరిహరస్వామిజీ, బీజేపీ నేత మురుగేశ్‌నిరాణిని మంత్రిగా చేయాలని లేదా పంచమశాలిలంతా వ్యతిరేకమమవుతామని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల చంద్రశేఖరస్వామిజీ, డీకే శివకుమార్ కోసం సిద్దరామయ్య సీఎం స్థానాన్ని వదులుకోవాలని వ్యాఖ్యానించగా లింగాయత స్వామిజీలు మా వారికి సీఎం పదవి ఇవ్వాలంటూ వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావించారు.

రోజూ కోటి లీటర్ల పాల సేకరణ

కేఎంఎఫ్ సాధనకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశంస

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) రోజుకు కోటి లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని సాధించడంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశంసించారు. మంగళవారం గోపూజ జరిపి పాడిరైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నందిని బ్రాండ్ డెయిరీ ఉత్పత్తులు పేరొందాయన్నారు. రెండు నెలల క్రితం 90 లక్షల లీటర్లు సాధ్యమైందని, ప్రస్తుతం కోటి లీటర్ల లక్ష్యం సాధ్యమైందన్నారు. 15 పాల సమాఖ్యలు, 15 మదర్ డెయిరీలు, 16వేల పాల సేకరణ సంఘాలు సమిష్టి కృషితోనే సాధించారని కొనియాడారు. మంత్రులు రాజణ్ణ, జమీర్ అహ్మద్‌ఖాన్, వెంకటేశ్, ఎమ్మెల్సీ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



కేఎంఎఫ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

ముడా కమిషనర్ సహా నలుగురు బదిలీ

అవినీతిపై విచారణకు కమిటీ

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ముడా) పరిధిలో ఇంటి స్థలాల పంపిణీలో అవినీతి ఆరోపణలు వచ్చిన మేరకు కమిషనర్‌తోపాటు ముగ్గురు అధికారులను ఉన్నఫలంగా బదిలీ చేశారు. విచారణకు కమిటీని వేశారు. నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ ముడా కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులతో సమీక్ష జరిపి అనంతరం మీడియాతో మాట్లాడారు. అవినీతి ఆరోపణలపై కమిటీ నిష్పక్షపాతంగా విచారణలు సాగేందుకు కమిషనర్ దినేశ్‌కుమార్, కార్యదర్శి శేఖర్‌తోపాటు మరో ఇద్దరు అధికారులను బదిలీ చేశామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ అవినీతిని తీవ్రంగా పరిగణించాలని ఆదేశించారన్నారు. కొందరు అధికారులు, దళారీలు అవినీతికి పాల్పడ్డారని అన్నారు. ముడాలో నెలరోజులపాటు స్థలాల పంపిణీ చేసేది లేదన్నారు. గడిచిన రెండు మూడేళ్లలో 50:50 నిష్పత్తితో కేటాయించిన ఇంటి స్థలాలను పెండింగ్‌లో పెడతామని అన్నారు. కేబినెట్ తీర్మానం లేకుండా స్థలాలు పంపిణీ చేయరాదని గత ఏడాది అక్టోబరులోనే సూచించామన్నారు. ఎమ్మెల్సీ విశ్వనాథ్ ఆరోపించినట్టుగా డాక్టర్ యతీంద్ర పాత్ర లేదన్నారు. ఆ తర్వాత సాక్ష్యాలు ఉంటే ఇవ్వాలన్నారు. విశ్వనాథ్ ఇప్పుడు మాట్లాడుతున్నారని, స్థలాలు కోల్పోయి తమ వద్దకు వచ్చి డిమాండ్ చేసినవారి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. కాగా, 2020 నుంచి ఇప్పటి వరకు రిజిస్టర్ అయిన స్థలాలకు సంబంధించి సమగ్ర సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్సీ విశ్వనాథ్ ముడాకు లేఖ రాశారు. పెన్ డ్రైవ్ రూపంలో అయినా వివరాలు ఇవ్వాలని కోరారు.



పసుపు - కుంకుమగా నా భార్యకు స్థలమిచ్చారు : సీఎం

ముడాలో నిబంధనలకు వ్యతిరకంగా స్థలం మార్పిడి చేయలేదని, బావమరిది పసుపు-కుంకుమ కింద తన భార్యకు ఇచ్చారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరు ఆయన మంళవారం మీడియాతో మాట్లాడుతూ ఇది బీజేపీ హయాంలో జరిగిందని, ఎకరా 15 గుంటల భూమి తన భార్య పేరిట ఉండేదని, ఈ భూమిని బావమరిది తీసుకుని పసుపుకుంకుమ రూపంలో ఇచ్చారన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు భూమి కొనుగోలు చేయలేదన్నారు. చట్టప్రకారం 50:50 నిష్పత్తిన భూమి ఇస్తామని ముడా ప్రకటించిందని, అయితే సైట్‌లు చేసి పంచేశారని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా చట్ట ప్రకారంగా తమకు ఇచ్చారన్నారు.

జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నిఖిల్..?




బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా దేవెగౌడ మనవడు, కేంద్రమంత్రి కుమారస్వామి వారసుడు నిఖిల్ కుమార్‌స్వామిని నియమించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నిఖిల్ వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కుమారస్వామి కేంద్రమంత్రి కావడంతో పదవిని వదులుకోవాలని నిర్ణయించారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని భావించారు. మాజీమంత్రి బండెప్ప కాశంపూర్, ఎమ్మెల్యే సీటీ సురేశ్‌బాబు పేర్లు వినిపించాయి. చెన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసేది లేదని, పార్టీ కోసమే పనిచేస్తానని నిఖిల్ ఇటీవల స్పష్టం చేశారు. దీంతో నిఖిల్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. జేడీఎస్ శాసనసభా పక్ష నాయకుడిగా సీనియర్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. సీనియారిటీతోపాటు పార్టీపట్ల అంకిత భావం ఉన్న నాయకుడిగా ఆయనకే ఎక్కువ అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జీటీ దేవెగౌడ జేడీఎస్ పార్టీ కోర్‌కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 15నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ఈలోగానే ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

ఆభరణాలంటే మగువలకు ఆసక్తి

మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలంటే మగువలకు చాలా ఆసక్తి అని, నాణ్యమైన వాటిని ఎంచుకోవడం ముఖ్యమని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పేర్కొన్నారు. యలహంకలో నవరతన్ జ్యువెలర్స్ షోరూంను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్‌చంద్ బప్నా ఆధ్వర్యంలో షోరూం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మాట్లాడుతూ ఒకప్పుడు ఆభరణాలు చిన్నదుకాణాలలోనే కొనుగోలు చేసేవారని, ఇటీవలి కాలంలో బ్రాండ్లకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. నవరతన్ నమ్మకానికి పేరుగా ఉందని అన్నారు. బంగారం ధరలు అమాంతం పెరిగినందున కొనుగోలు చేసేవారు నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆభరణాల్లో ప్రాంతాలవారీగా ప్రత్యేకమైన డిజైన్లు ఉంటాయని, ప్రస్తుతం షోరూంలలో అన్ని బ్రాండ్లు లభిస్తాయన్నారు. నవరతన్ ఎండీ గౌతమ్‌చంద్ బప్నా మాట్లాడుతూ బెంగళూరులో అన్నివర్గాల వినియోగదారులను ఆకట్టుకున్నామన్నారు. నాణ్యత విషయంలో రాజీకి తావులేకుండా విక్రయాలు జరుపుతున్నామని తెలిపారు. ప్రస్తుతానికి ఎంజీ రోడ్డు, జయనగర్, రాజాజినగర్, సిటి స్ట్రీట్‌లో షోరూంలు తెరిచామని అన్నారు. బెంగళూరు ఉత్తర ప్రాంత వాసులకు వీలుగా యలహంకలో షోరూం ప్రారంభించామన్నారు. త్వరలోనే కేఆర్‌పురంలో శాఖ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గౌతమ్‌చంద్ కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.


షోరూం ప్రారంభంలో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,585.87	1,576.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13,410	279
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	297	1,149
సామర్థ్యం (టీఎంసీలు)	7.91	3.01

కొంపముంచిన అత్యాశ



- అధిక వడ్డీ ఆశతో కోట్లలో డిపాజిట్లు
- ముఖం చాటేసిన ప్రైవేటు కంపెనీ యజమాని..!

మనవాళ్లు ఉత్తవెధవాయి లోయ్! అంటాడు గిరీశం కన్యాశుల్కంలో. అలాగే ఎన్నిసార్లు మోసం చేసినా జనం మళ్లీ మళ్లీ అధిక వడ్డీలు ఇస్తామన్నవారిని నమ్ముతూనే ఉంటారు. కావలసినంత పోగేసుకున్న తర్వాత బోర్డు తిప్పేస్తుంటారు ఆ మోసగాళ్లు. ఈ క్రమంలో మోసపోవడం ఖాతాదారు వంతవుతుంది. అలాగే ప్రస్తుతం రాయచూరు జిల్లా మాన్విలో కూడా ఒక ప్రైవేట్ ఫైనాన్సియర్ మీ సొమ్ముకు రెట్టింపు అనగానే జనం పాలోమని వెళ్లి తమ కష్టార్జితం వాడికి సమర్పించుకున్నారు. ఆరు నెలలు గడవగానే వాడు బోర్డు తిప్పేశాడు. ఇక ఏడ్చి ప్రయోజనం ఏముంటుంది?! కొందరు పోలీసులు కూడా ఇందులో డిపాజిట్ చేయడమే ఈ ఎపిసోడ్‌లో ట్విస్ట్!

రాయచూరు, జూలై 2 : డిపాజిట్ చేసిన సొమ్ముకు ఏడాదిలోగా రెట్టింపు చెల్లిస్తామంటూ చెప్పిన ప్రైవేటు కంపెనీ యజమానిని ప్రజలు నిండా నమ్మారు. నమ్మిన వారిని నిండా ముంచి పరారయ్యాడు ఆ కంపెనీ యజమాని. మాన్వి నగరం రిమ్స్ ఆస్పత్రి సమీపంలో ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీ ఏర్పాటు చేసిన యజమాని గత ఏడాదిన్నర కాలంగా స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించాడు. డిపాజిట్ చేసిన సొమ్ముకు ఏడాదిలోగా రెట్టింపు సొమ్ము ఇస్తామని నమ్మబలికాడు. దీంతో అనేక మంది ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా కొంత మంది పోలీసులు సైతం డిపాజిట్ చేశారు. ఈ సొమ్ము దాదాపు 10 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంకేముంది... కథమామూలే. గత 4-5 రోజులుగా కంపెనీ యజమాని కనిపించడం మానేశాడు.

దీంతో ఆందోళనకు గురైన ఖాతాదారులు ఆ కంపెనీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కాగా ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి ఏ ఒక్క బాధితుడు ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు సైతం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరమంతా ఈ డిపాజిట్లతో పరారైన వ్యక్తి గురించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారినా పోలీసులు మాత్రం దానిపై దృష్టి సారించడం లేదు. ఈ విషయాన్ని పలు మీడియా సంస్థలు ప్రశ్నించగా ఎవ్వరు తమకు ఫిర్యాదు చేయలేదని ఎలాంటి ఫిర్యాదు లేకుండా తామేమి చేయజాలమంటు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఇలాంటి కంపెనీ ఒకటి కలబుర్గిలో ఏర్పాటు చేసి దాదాపు 32 కోట్లకు పైగా ప్రజల నుంచి వసూలు చేసుకుని నిర్వాహకులు పరారయ్యారు. ప్రస్తుతం అదే పరిస్థితి రాయచూరులో ఎదురైందంటూ కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ఖాతాదారులు మాత్రం తమకు ఎక్కువ వడ్డీ లేకున్నా ఫరవాలేదు తాము డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగిస్తే చాలు అనే ధోరణిలో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మరికొంత మంది చెబుతున్నారు. ఏదిఏమైనా దాదాపు 30 నుంచి 40 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి ఉంటారని నగరంలో అంచనా వేస్తుండగా దీని పై దర్యాప్తు చేసి నిగ్గు తేల్చడంలో మాత్రం పోలీసులు తాత్సారమే కనబరుస్తున్నారు. డిపాజిట్‌దారులకు సొమ్ము తిరిగి వస్తుందా? లేకా గతంలో జరిగిన సంఘటనల మాదిరిగానే ఇది కూడా తెరమరుగు కానుందా అన్నది తేలాల్సి ఉంది. కాగా సొమ్మును డిపాజిట్ చేసిన ఖాతాదారులు మాత్రం గత రెండు రోజులుగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా కార్యాలయం చుట్టు తిరుగుతూ యజమాని కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

విశ్వవిద్యాలయాలు ఆత్మాభిమానానికి వేదికలు కావాలి



ప్రసంగిస్తున్న జ్ఞానప్రకాశ్ స్వామీజీ

రాయచూరు, జూలై 2 : విశ్వవిద్యాలయాలు విద్యార్థుల్లో జాతీయతాభావాన్ని పెంపొందించడంతో పాటు వారిని ఆత్మాభిమానం ఉన్నవారిగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని మైసూరుకు చెందిన మఠాధిపతి శ్రీ జ్ఞాన ప్రకాశ్ స్వామీజీ అన్నారు. అదే సమయంలో విశ్వవిద్యాలయాలు విజ్ఞాన వేదికలుగా వెలగాలని విద్యార్థుల మేధో వికాసాలను పెంపొందించడంతో పాటు వారు అన్ని రంగాల్లో ఘన కీర్తి సాధించాలన్నారు. స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద మంగళవారం క్రాంతియోగి బసవేశ్వరుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్వామీజీ మహనీయుల జయంతి ఉత్సవాలు కేవలం నామమాత్రపు వేడుకలు కారాదని వారి ఆశయాల సాధనే లక్ష్యంగా మనం శ్రమించాల్సి ఉందన్నారు. 13వ శతాబ్దంలోనే తన అభ్యుదయ భావాలను సమాజానికి చాటిన బసవేశ్వరుడు అన్ని తరాలకు ఆదర్శమన్నారు. అదే సమయంలో ప్రజాస్వామిక వ్యవస్థలో అన్ని వర్గాల వారికి సమాన హక్కులను బాధ్యతలను రాజ్యాంగం ద్వారా ప్రసాదించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మేధోసంపద దేశానికి ప్రపంచానికి ఆదర్శమన్నారు.

వచన సాహిత్యంలో హలకట్టి పాత్ర ఆదర్శం



హలకట్టికి నివాళులర్పిస్తున్న మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, జూలై 2: శతాబ్దాల వచన సాహిత్యాన్ని కాపాడి నేటి తరానికి అందించిన ఘనత డా.హలకట్టికి చెందుతుందని బళ్లారి నగర మేయర్ ముల్లంగి నందీశ్ తెలిపారు. నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని సాంస్కృతిక సముదాయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హలకట్టి జన్మదినోత్సవంలో భాగంగా వచనసాహిత్య సంరక్షణ దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కన్నడ వచన సాహిత్య సర్వతోముఖాభివృద్ధికి డా.హలకట్టి పునాది వేశారని, మహానుభావుల మాటలను భద్రపరిచి నేటితరానికి అందించారన్నారు. జాతీయ బసవదళ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 12వ శతాబ్దపు వచన యుగంలో చెల్లాచెదురుగా ఉన్న వచన సాహిత్యాన్ని ఏకంచేసి వచన సాహిత్యాన్ని పరిరక్షించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమన్నారు. వచనసాహిత్యంపై హలకట్టి అపారమైన ప్రేమను పెంపొందించుకుని కన్నడ సాహిత్యానికి విశేష కృషిచేశారన్నారు. కార్యక్రమంలో రారావి గ్రామానికి చెందిన చిదానంద బృందం గాత్రసంగీతాన్ని అందించారు.

ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సుఖుమ్, తహశీల్దార్ గౌసియా బేగం, ప్రభుత్వ విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ వాసుదేవి, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, సిబ్బంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో అధికారుల నివాళి

సిరుగుప్ప, జూలై 2 : వచన సాహిత్యంలో హళికట్టి ఎంతో ప్రసిద్ధి చెందిన కవి అని తహసీల్దార్ విశ్వనాథ్ అభిప్రాయపడ్డారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో హళికట్టి భావ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హళకట్టి సంగీత సాహిత్యం, ప్రవచనాలు రచించడంలో ఎంతో ప్రసిద్ధి చెందాడన్నారు. ఆయన తత్వసిద్ధాంతాలను అనుసరించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, ఆర్‌ఐ మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

ఏళుపడగల నాగప్ప భక్తులకు తాగునీరు



నాగప్ప ఆలయానికి వచ్చిన భక్తులు మంచినీటిని పట్టుకుంటున్న దృశ్యం

కంప్లి, జూలై 2 : తాలుకా పరిధిలోని బుక్కసాగర గ్రామంలోని ఏళుపడగల నాగప్ప దేవస్థానం వద్ద భక్తాదులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గతంలో భక్తాదులు పొరుగు గ్రామాలు, పట్టణాల నుంచి ఈ ఆలయానికి పూజలకు చేరుకుని నీటి సమస్య కారణంగా ఇబ్బంది పడేవారు. దీనిని దృష్టిలో వుంచుకుని అధికారులు తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి హనుమంతప్ప మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తాదులకు మంచినీరు, మరుగుదొడ్లు, విశ్రాంత గదులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ప్రహరీగోడను ఏర్పాటు చేసి భక్తాదులకు అనుకూలంగా ఏర్పాటు చేస్తామన్నారు. భక్తాదులు ఎలాంటి ఇబ్బందులుపడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధ్వంసమైన మండపాలు, ప్రహరీలు



కూలిన ప్రహరీ

కంప్లి, జూలై 2 :ప్రసిద్ధి గాంచిన దక్షిణ కాశీ హంపిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండపాల ప్రహరీగోడలు కుప్ప కూలాయి. వెంటనే వాటిని తిరిగి నిర్మించాలని సంఘ సంస్థ నేతలు, పర్యాటకులు కోరుతున్నారు. ఎదురు బసవన్న సమీపంలోని మండపాలు, కోదండ రామస్వామికి వెళ్లే రోడ్డు మార్గంలో గల మండపాల గోడలు కూలాయి. వెంటనే దేవాదాయశాఖ గానీ, పురాతత్వశాఖ గానీ వీటిపై దృష్టిసారించి గోడల నిర్మాణం చేపట్టాలని కోరారు.

మొక్కజొన్నకు లద్దెపురుగు బెడద

కంప్లి, జూలై 2 : ఇప్పటికే నాటుకున్న ముంగారు పంటలకు లద్దెపురుగు బెడదవల్ల మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూడ్లిగి తాలుకాలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న రైతులు లద్దెపురుగు బెడద వల్ల ఇబ్బందులు పడుతుండటంతో ఆ పంటలను సునీల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి శాతం తక్కువైనా, ఎక్కువైనా ఈ ప్రకృతికి అనుగుణంగా ఖరీఫ్ పంటల్లో లద్దెపురుగు బెడద ఖచ్చితంగా ఉంటుందన్నారు. రైతన్నలు వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించి వెంటనే వారిచ్చిన మందులను వాడాలని కోరారు. అలాగే అధికారులు కూడా జాగ్రత్తలు వహిస్తే మాత్రమే లద్దె పురుగు బెడద రాకుండా వుంటుందని సూచించారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కంటోన్మెంట్ వద్ద ఓపెన్ గేటు ఏర్పాటుచేయాలి



వినతి పత్రం సమర్పిస్తున్న యాక్షన్‌క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి

బళ్లారి సిటీ, జూలై 2: బళ్లారి నగరంలో ఉన్న రైల్వేగేట్‌ను ఓపెన్ రైల్వేగేటుగా మార్చాలని యువసేన సోషల్ యాక్షన్ క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే గేటు మీదుగా వచ్చే, పోయే వాహనాలన్నీ ప్రస్తుతం అసౌకర్యానికి గురవుతున్నాయన్నారు. ప్రధానంగా ప్రవేట్, ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లేవారు ఈ గేట్‌ద్వారానే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి అరగంటకు రైల్వే గేట్ మూసివేస్తున్నారని, దీంతో వాహనదారులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశంపై చర్చించి రానున్న బడ్జెట్‌లో ఈ గేట్‌ను మార్పుచేయడానికి నిధులు మంజూరు చేయాలనికోరారు. ఈసందర్భంగా యువసేన సోషల్ యాక్షన్ క్లబ్ సభ్యులు ఎస్‌.కృష్ణ, భాషా, శ్రీనివాసరెడ్డి, ఉప్పర మల్లప్ప, జగన్నాథ్, నారాయణ, వెంకటేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ఉపాధి కల్పించాలి



పంచాయతీ ఆఫీసు ముందు ఏఐకేఎంఎస్ నిరసన

బళ్లారి సిటీ,జూలై 2: బళ్లారి తాలూకా డి.కగ్గల్లు గ్రామంలో ఉపాది హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజులు పనికల్పించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ రైతు సంఘం తరపున డిమాండ్‌చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాచేసిన సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ నరేగా పథకం ప్రారంభించి 18 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వంద రోజుల పనిదినాలు కల్పించలేదన్నారు. వందరోజుల పనివేళలను కల్పించేకపోతే బారీ పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

అంజూర సాగుతో అంతులేని లాభాలు



విస్తారంగా సాగవుతున్న అంజూరపంట


బళ్లారి సిటీ, జూలై 2:జిల్లాలో నీటి పారుదల ఉండే భూముల్లో పండించే వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలకు ఒక్కోసారి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంటుంది. సకాలంలో వర్షం కురువక, కురిసినా తెగుళ్ళు చుట్టుముట్టడం, తీరా పంట చేతికి వచ్చాక ధర లేక రైతులు దిగాలు చెందడం మనం నిత్యం చూస్తునే ఉంటాము. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో కొందరు రైతులు అంజూర సాగు చేపట్టారు. పండ్లతోటలను పెంచుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. అంజూర పండ్ల సాగులో రైతులు ప్రతి రోజు ఆదాయాన్ని పొందవచ్చు. ప్రస్తుత మార్కెట్లో అంజూర కిలో రూ.150పై మాటే పలుకుతుండడంతో రైతులకు పెట్టుబడులు పోను ఎకరాకు ఏడాది రూ.2లక్షలకు పైగాఆదాయం వస్తోంది. జిల్లాలో కురుగోడు, లక్ష్మీపురం ,కల్లుకంబ, ముష్టగట్టి, వాదనహట్టి, సిరగేరి, కంప్లి, మించేరి తదితర గ్రామాల్లో రైతులు అధిక సంఖ్యలో అంజూర పండ్లను సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడ పండించిన అంజూరను పొగరు రాష్ట్రాలు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు.

- పండులో ఔషధగుణాలు ఎక్కువే

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అంజూరలో ఔషధగుణాలు ఎక్కువగా ఉండటంతో వీటిని ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. ఆరోగ్యానికి ఈ పండు రామబాణంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్దక నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. బళ్లారి జిల్లాలో దాదాపు 5వేల ఎకరాలలో అంజూర సాగు చేస్తున్నారు. దీంతో ఇతరప్రాంతాలకు జిల్లా నుంచి ఎగుమతులు పెరిగాయి. అంజూరాను ప్రత్యేక ప్యాకింగ్ చేస్తూ ఎగుమతి చేస్తున్నారు. వీటిసాగుతో రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదిపొడుగునా పనులు దొరుకుతున్నాయి. జిల్లాలో ఒక్కోరైతు ఎటా రూ 10నుంచి 20లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అంజూరాలో పెట్టుబడులు తక్కువగా ఉండి ఆదాయం ఎక్కువగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బళ్లారి రాఘవ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం



బళ్లారి సిటీ,జూలై 2: బళ్లారి రాఘవ 144వ జయంత్యుత్సవం సందర్భంగా ఆగస్టు 2, 3వతేదీలలో అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మెమోరియల్ అధ్యక్షుడు కోటేశ్వరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ రాఘవ మెమోరియల్ అసోసియషన్ తరపున బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా 15సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో కన్నడ, తెలుగు రంగస్థల కళాకారులకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బళ్లారి రాఘవ రాష్ట్ర స్థాయి అవార్డును కన్నడ, తెలుగు రంగస్థల కళాకారులకు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర స్థాయి థియేటర్ ఆర్టిస్టులు జూలై 15వ తేది లోగా తమ నటనా సేవల వివరాలను సమర్పించాలన్నారు.

అంగన్‌వాడీలకు సక్రమంగా పౌష్టికాహారం



హడగలిలో అంగన్‌వాడీ స్టోరేజ్ పత్రాలను పరిశీలిస్తున్న జడ్పీసీఈవో

కంప్లి, జూలై 2 : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించాలంటూ జెడ్పీ సీఈవో సదాశివ ప్రభు తెలిపారు. ఆకస్మికంగా ఆయన మంగళవారం హడగళి తాలుకా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడున్న ఆహార మెనూను పరిశీలించారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం నాణ్యత గల ఆహారాన్ని సక్రమంగా అందించి చిన్నారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని హెచ్చరించారు. ఇందులో నాణ్యత తక్కువైతే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ తాలుకా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున నిరసన

హోసూరు జూలై 2: తమిళనాడు ముఖ్యమంత్రి ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో హోసూరు తాలూకా కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. బకాయిల సరెండర్‌తో సహ బాధిత పార్టీకి 21 నెలల కాలానికి సంబంధించిన బకాయిలను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. పోషకాహార రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు మరణించిన తర్వాత కారుణ్య ప్రాతిపదికన కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగం ఇవ్వాలన్నారు. పోషకాహార ఉద్యోగుల వారసులకు ఉపాధి నిరాకరించడాన్ని రద్దు చేయాలన్నారు.. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తమ పనిభారాన్ని తగ్గించుకోవాలని, ప్రభుత్వ సెలవు దినాల్లో నిర్వహించే అధ్యయన సమావేశాలకు కూడా దూరంగా ఉండాలన్నారు. డిమాండ్లు నెరవేర్చాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పలువురు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రాణిస్తున్న రోటరీ క్లబ్

హోసూరు జూలై 2 సామాజిక సేవలో రాణిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ హోసూరు లెజెండ్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాధవన్, కార్యదర్శిగా శరవణన్, కోశాధికారిగా యువరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హోసూరు మత్తిగిరి సమీపంలోని శారదా నికేతన్ అన్బు హౌస్‌లో విద్యార్థులకు సుమారు రూ.15 వేల విలువైన ఆహారాన్ని పంపిణీ చేశారు. హోసూరులో స్థిరమైన అభివృద్ధికి పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీరు విద్యార్థులకు విద్య తదితర అంశాలకు సంఘం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ రాజమణి సహ 30 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాతలకు ప్రశంసా పత్రాల అందజేత

హోసూరు(కృష్ణగిరి) జూలై 2: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం 20 మంది రక్తదాతలకు జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాణపాయ పరిస్థితులో శస్త్రచికిత్స అవసరమైన లక్షలాది మందిని రక్తదానం కాపాడుతుందన్నారు. మతా, శిశు సంరక్షణలో మానవ నిర్మిత ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్తదానం ప్రాణాలను రక్షిస్తుందన్నారు. ప్రాణాలను రక్షించే రక్తాన్ని ఉచితంగా దానం చేసిన స్వచ్ఛంద రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపేందుకు జూన్ 14 న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. రక్తదాతలకు ధన్యవాదాలు అనే థీమ్‌తో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. మన కృష్ణగిరి జిల్లాలో 2023-2024 సంవత్సరంల్లో 107 శిబిరాల ద్వారా 9817 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ భూపతి, బ్లడ్ బ్యాంక్ వైద్యురాలు వసంతకుమమార్ పాల్గొన్నారు.



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్నకలెక్టర్

ప్రత్యామ్నాయ భూములకోసం రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న భూములు కోల్పోయిన రైతులు

- సాగు యోగ్యమైన భూమి కోసం రైతుల డిమాండ్
- భూముల సరిహద్దులను చూపించాలి

రాయచూరు, జూలై 2 :జిల్లాకు మంజూరైన ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మాణం కోసం తమ వద్ద నుంచి తీసుకున్న భూమికి బదులు ప్రత్యామ్నాయ భూమిని అప్పగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద దాదాపు 50 మందికి పైగా వడవాటి తదితర గ్రామాలకు చెందిన రైతులు జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తాలూకాలోని వడవాటి శివారులో 99/1/3 సర్వే నెంబర్‌లో ఉన్న 65 ఎకరాల పొలాన్ని 1978లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు ముఖ్యంగా దళితులకు అందజేసింది. అప్పటి నుంచి వాటిని సాగు చేస్తు జీవనం సాగిస్తున్న రైతులు, ప్రస్తుతం ఆ భూములు కోల్పోయే పరిస్థితి తలెత్తింది. ఉన్న 65 ఎకరాల్లో 35 ఎకరాలను ఇటీవల ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ కళాశాల కోసం మంజూరు చేసింది. అందుకు బదులుగా రైతులకు ప్రత్యామ్నాయ భూములను అందజేసినా వాటికి సంబంధించి ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వకపోవడం సమస్యగా మారింది. దీంతో పాటు తమకు అందజేసిన భూములకు సంబంధించి సరిహద్దులను కూడా చూపిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. తమకు కేటాయించిన భూమి ఎందుకు పనికిరానిదని తాము ఏళ్ల తరబడి కష్టపడి సాగు చేసుకున్న భూమిని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం తమకు సాగు యోగ్యమైన భూమినే అందివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఇందుకు సంబంధించి అధికారులు గత కొన్ని నెలలుగా నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తున్నారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ కళాశాల భవన నిర్మాణం కోసం చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా తమకు ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని, పరిహారం చెల్లించిన అనంతరమే నిర్మాణాలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

సూర్యదేవర సంజీవదేవ్ (జయంతి)



ప్రముఖ రచయిత డాక్టర్ సూర్యదేవర సంజీవదేవ్ 1914 జూలై 3న గుంటూరు జిల్లా తుమ్మపూడిలో జన్మించారు. తత్వవేత్త, చిత్రకారుడు, కవి, మానవతావాదిగా రాణించారు. 'ఏ ప్రాంతమూ పరాయి కాదు ఏ మనుషులూ పరాయివారు కారనే' వసుధైక కుటుంబ సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో పెట్టారు. బాల్యంలోనే ఇల్లు వదిలి దేశసంచారం చేశారు. 20ఏళ్లలోపే హిమాలయాలు సహా ఉత్తర భారతదేశం అంతా పర్యటించారు. హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఫ్రెంచ్ జపనీస్ నేర్చుకున్నారు. సమకాలీన ప్రపంచ మేధావులందరితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. ఆయన నివసించే తుమ్మపూడి గ్రామానికి దేశవిదేశాల కళాకారులు, సాహిత్యోపాసకులు ఆయన కోసం వచ్చేవారు. 1999 ఆగస్టు 25న కన్నుమూశారు.

ఎస్వీ రంగారావు (జయంతి)



ఎస్వీఆర్‌గా పేరొందిన సామర్ల వెంకట రంగారావు 1918 జూలై 3న కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. సినీ నటుడు, దర్శకుడు, రచయిత. నాటకాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఫైర్ ఆఫీసర్‌గా కొంతకాలం పని చేశారు. నటనకోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో మూడు దశాబ్దాలపాటు 300కుపైగా చిత్రాలలో నటించారు. 'రాష్ట్రపతి అవార్డు', నంది అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ తదితర అవార్డులు అందుకున్నారు. ప్రతినాయక పాత్రల్లోనూ, అనేక సహాయపాత్రలలోనూ తనదైన ముద్ర వేశారు. విశ్వనట చక్రవర్తి, నట సార్వభౌమ, నటసింహ తదితర బిరుదులు పొందారు. 1974 జూలై 18న గుండెపోటుతో కన్నుమూశారు.

ఎంఎస్ రామారావు (జయంతి)



తెలుగు సినీ రంగంలో తొలి నేపథ్యగాయకుడు గాయకుడు, స్వరకల్పనలో పేరొందిన ఎంఎస్ రామారావు 1921 జూలై 3న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతం మోపర్రులో జన్మించారు. ఆధ్యాత్మిక పాటలు ఆలపించడంలో పేరొందారు. ప్రత్యేకించి ఆయన గేయ రూపంలో ఆలపించిన 'సుందరకాండము' ఎంతో పేరొందింది. తులసీదాసు రచించిన 'హనుమాన్ చాలీసా'ను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. లలిత గీతాలతో పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోనూ పాటలు పాడారు. సుందరకాండతో ఆయన 'సుందరదాసు'గా పేరొందారు. 1992 ఏప్రిల్ 20న కన్నుమూశారు.

బలివాడ కాంతారావు (జయంతి)



కేంద్రీయ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీ ప్రముఖ తెలుగు నవలా రచయిత బలివాడ కాంతారావు 1927 జూలై 3న శ్రీకాకుళం జిల్లా మండపంలో జన్మించారు. ఇండియన్ నేవీలో వివిధ హోదాలలో కొనసాగారు. 38 నవలలు, 400 చిన్నకథలు, 5 నాటికలు రచించారు. రేడియో కథలు, నాటకాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిం చారు. గోపీచంద్ సాహిత్య పురస్కారం, కళాసాగర్ విశిష్ట పురస్కారం అందుకున్నారు. 2000 మే 6న కన్నుమూశారు.

ఎంఎల్ వసంతకుమారి (జయంతి)



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత మద్రాస్ లలితాంగి (ఎంఎల్) వసంత కుమారి 1928 జూలై 3న మద్రాస్‌లో జన్మించారు. నేపథ్య గాయకురాలిగా రాణిం చారు. గాయనీమణులు ఎంఎస్ సుబ్బలక్ష్మి, డీకే పట మ్మాళ్‌లకు సమకాలీనులు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, ఇంకా సంగీత కళానిధి బిరుదు తదితర అవార్డులు అందుకున్నారు. 1990 అక్టోబరు 31న కన్నుమూశారు.

జ్యోతి సురేఖ వెన్నం (పుట్టినరోజు)



ప్రముఖ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం 1996 జులై 3న జన్మించారు. విలువిద్యలో బాల్యంనుంచే ఆసక్తి ఉండగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 70కుపైగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మెడల్స్ అందుకున్నారు. 2022 ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని 3 బంగారు పతకాలు అందుకుని రికార్డు నెలకొల్పారు. నాల్గో యేట కృష్ణానదిని ఈది లిమ్కా రికార్డు సృష్టించారు. 2011 నుంచి విలువిద్య (ఆర్చరీ)లో తనదైన ప్రతిభతో రాణిస్తున్నారు.


పింఛన్ల సొమ్ము స్వాహా

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 2: శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున పింఛన్ల సొమ్ము పంపిణీ చేయకుండా చేతివాటం ప్రదర్శించాడు. లబ్ధిదారులతో సోమవారం వేలిముద్రలు వేయించుకుని.. సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోయాడు. మొత్తం రూ.8 లక్షల వరకూ కాజేశాడని బాధితులు ఎంపీడీఓ నరసింహమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసు కువెళ్లారు. టీడీపీ కూటమి మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకు నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ శనివారం రూ.42 లక్షలు డ్రా చేశాడు. అదే రోజు సచివాలయంలో పనిచేసే తొమ్మిది మంది ఉద్యోగులకు రూ.3 లక్షలు.. రూ.5 లక్షలు చొప్పున అందజేసి, పింఛన్లు పంపిణీ చేయమని సూచించాడు. తక్కువ వస్తే తనను అడగాలని చెప్పి వెళ్లిపోయాడు. తన వంతుగా పంపిణీ చేయాల్సిన సొమ్మును మాత్రం స్వాహా చేశాడు. సుమారు 50 మంది లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు తరువాత ఇస్తానని చెప్పినట్లు బాధితులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనూ మల్లికార్జున పింఛన్లను స్వాహా చేశాడని, అప్పట్లో వైసీపీ నాయకులు దుప్పటి పంచాయితీ చేసి అతన్ని కాపాడారని ఆరోపణలు ఉన్నాయి.

నానో సాంకేతికత సుస్థిరతకు మార్గదర్శకం

▸▸ మంత్రి బోసరాజు

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నానో సాంకేతిక పరిజ్ఞానం విభిన్న రంగాల సుస్థిరతకు మార్గదర్శకమని ఐటీ బీటీ శాఖల మంత్రి బోసరాజు అభిప్రాయపడ్డారు. ఆగస్టు 13నుంచి జరిగే 'బెంగళూరు ఇండియా నానో' 13వ ఎడిషన్‌పై మంగళవారం ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, మానవ వనరులు, ఆరోగ్య సంక్షోభాలు వంటి అంశాలో నానో టెక్నాలజీ కీలక ప్రభావం చూపుతుందన్నారు. చిన్నపరిణామమైన అధిక పరిష్కారాలు సాధ్యమన్నారు. నానో టెక్నాలజీ సుస్థిరతకోసం అనే థీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విజన్ గ్రూప్ చైర్మన్ నవకాంత్‌భట్, సీఈఓ ఛైయిర్ అనిల్‌కుమార్, ఐటీబీటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు. మూడు రోజుల సదస్సులో 25 కాన్ఫరెన్స్‌లు ఉంటాయని 700మంది ఎక్స్‌పర్ట్ స్పీకర్‌లు పాల్గొంటారన్నారు.



'బెంగళూరు ఇండియా నానో' సన్నాహకసభలో మంత్రి బోసరాజు

శిరసి వాసికి ప్రపంచ సుందరి కిరీటం

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకా ముండగసెరె గ్రామానికి చెందిన డాక్టర్ శృతిహెగ్డే అమెరికాలో జరిగిన అందాల పోటీల్లో మిస్ వరల్డ్ 2024 (ప్రపంచ సుందరి) కిరీటాన్ని దక్కించుకున్నారు. ముండగసెరె గ్రామానికి చెందిన కృష్ణాహెగ్డే కమలా దంపతులు కొంతకాలంగా హుబ్బళ్ళిలో నివసిస్తున్నారు. వారి కుమార్తె శృతి హెగ్డే. 2018లో మిస్ కర్ణాటక రన్నరప్, మిస్ సౌత్ ఇండియా విజేతగా నిలిచారు. 2023లో మిస్ ఏసియా ఇంటర్నేషనల్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచారు. అమెరికా దేశం ఫ్లోరిడాలో జూన్ 6 నుంచి 10 వరకు పోటీలు జరిగాయి. 40 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు. జాతీయస్థాయి పోటీలు ర్యాంప్‌వాక్, స్విమ్మింగ్, ప్రశ్నోత్తరాలు, వ్యక్తిగత అభి ప్రాయాలు వంటి అంశాలలో పోటీలు సాగాయి. అన్ని విభాగాల్లోనూ ఉత్తమ ప్రదర్శన ఇవ్వడంతో శృతిహెగ్డే మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్నారు. హుబ్బళ్ళిలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ శృతిహెగ్డే డెర్మటాలజిస్ట్‌గా తుమ కూరులో చదువుతున్నారు. భరతనాట్య కళాకారిణి అయిన శృతి హెగ్డే దుబాయ్, మాల్దీవ్స్, భూటాన్ దేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. కొన్ని సినిమాలు, సీరియల్స్ వెబ్‌సిరీస్‌లో నటించినట్టు సమాచారం.



కిరీటంతో డాక్టర్ శృతిహెగ్డే

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయండి

బంగారపేట, జూలై 2: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపాన గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వచ్ఛత పాటించాలని, రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని దళిత సమాజసేన డిమాండ్ చేసింది. ఈమేరకు రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం సాంకేతికంగా నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల పోరాటం ఫలితంగా అంబేడ్కర్ విగ్రహాన్ని మార్పు చేశారని, అయితే ఇక్కడ స్వచ్ఛత పాటించడం లేదన్నారు. రైల్వే ప్రయాణీకులకు సరైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రైల్వేస్టేషన్‌లో క్యాంటీన్ ఉన్నా స్వచ్ఛత మరీ చికలా మారందన్నారు. నిరసనలో గౌతమ్, అయ్యప్ప, అర్జున్, కరుణ, సుబ్రమణి, ప్రదీప్, అముల్, ఆటోరాజ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దళిత సమాజసేన నాయకులు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద కాలువలో అబెట్ మందు పిచికారి

శిడ్లఘట్ట, జూలై 2: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని తాలూకా ఆరోగ్యాధికారి దేవరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బచ్చహళ్ళి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. జ్వరాలతో బాధపడేవారి గురించి ఆరా తీశారు. తాలూకా ఆశా అధికారి గీతా మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో స్వచ్ఛత పాటించాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్ప, ఇతర వాటిల్లో దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రం ముందున్న కాలువలో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కాలువలో అబెట్ మందును పిచికారి చేశారు. దోమల వల్ల డెంగీ జ్వరం ప్రబలే అవకాశం ఉందని కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల్లో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పంచాయతీ పీడీఓలకు లేఖలు రాశామన్నారు. కాలువలలో మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించినట్టు తెలిపారు.

అక్షయ ఫౌండేషన్‌కు అగర్వాల్ ఆసుపత్రుల చేయూత

▸▸ రెండు వాహనాల విరాళం

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థకు అనుబంధమైన అక్షయపాత్ర ఫౌండేషన్‌కు డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రులనుంచి ప్రత్యేక వాహనాలను విరాళంగా ఇచ్చారు. 34 ప్రభుత్వ పాఠశాలల ద్వారా 2556మంది విద్యార్థులకు ఏడాదిలో 4.24 లక్షల భోజనాన్ని సమకూర్చినట్టు అగర్వాల్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ముఖ్యులు ధీరజ్ తెలిపారు. హుబ్బళ్ళిలో భోజనం సరఫరా చేసే వాహనాన్ని సమకూర్చామన్నారు. ఈ ప్రాంతంలో 28 పాఠశాలల నుంచి రోజుకు 6వేలమంది విద్యార్థులకు పౌష్టికాహారం సమకూరుస్తున్నామన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సీఎంఓ ధనంజయ్ గంజు మాట్లాడుతూ 16 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలతో కలిపి 20 లక్షల మందికి రోజూ ఆహారం సమకూరుస్తున్నామన్నారు. అగర్వాల్ ఆసుపత్రుల సహకారం సంతోషమన్నారు.



రెండు వాహనాల అందజేత

బాగేపల్లిలో కానరాని స్వచ్ఛత

బాగేపల్లి, జూలై 2: తాలూకా కేంద్రమైన బాగేపల్లి పట్టణంతోపాటు చాలా గ్రామాల్లో స్వచ్ఛత కొరవడింది. వర్షాకాలం ఆరంభమైన తరుణంలో దోమలు ప్రబలి డెంగీ, మలేరియా ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంది. మురుగునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇప్పటికే సూచనలు చేసినా చాలావరకు అమలు కాలేదని తెలుస్తోంది. పురసభ, గ్రామ పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టం లేదని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపక్కన చెత్తా చెదారం దిబ్బలు పేరుకుపోతున్నాయని, కాలువలలో పూడిక తీయాలని కోరుతున్నారు. పురసభ పరిధిలో 23 వార్డులు ఉండగా తాలూకాలో 19 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పట్టణంతోపాటు అనేక గ్రామీణ ప్రదేశాలలో స్వచ్ఛత కొరవడ్డంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు, గూళూరు రోడ్డు, ఆవులమండె, కొత్తపల్లి, సంతమైదానం, స్మశానం రోడ్డు, కుంబారపేట రోడ్డు, అంబేడ్కర్‌నగర్, వాల్మీకినగర్‌లలోని డ్రైనేజీలలో పూడిక తీయాల్సి ఉంది. పలు మార్గాలలో దుర్గంధం నెల కొనడంతో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.



రోడ్డు పక్కన చెత్త దిబ్బ



కాలువలో చెత్తాచెదారం

నగరంలో ఏఐ ఆధారిత హోం లిఫ్ట్ సేవలు

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హోం ఎలివేటర్ బ్రాండ్ నిభవ్ లిఫ్ట్ సంస్థ బెంగళూరులో సిరీస్ 4 హోం లిఫ్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. నిభవ్ లిఫ్ట్ సంస్థ ఫౌండర్ సీఈఓ విమల్‌బాబు మంగళవార మీడియాతో మాట్లాడుతూ ఏఐ ఆధారిత కేబిన్, డిస్‌ప్లే, ఆకర్షణీయమైన ఎల్ఓపీ ఫీచర్‌లు కలిగి ఉందన్నారు. మృదువుగా ల్యాండ్ అయ్యేందుకు లిఫ్ట్ లిడార్ 2.0 సాంకేతికతను వినియోగించామన్నారు. హోం ఎలివేటర్‌లో ఈ సౌలభ్యాలు ప్రథమమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా పనిచేసే ర్యాపిడ్ రెస్కో ఉందన్నారు. ఈ లిఫ్టులు కార్బన్‌సీల్ మోటార్ 2.0కు అనుబంధంగా ఉందన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శిడ్లఘట్ట, జూలై 2: తాలూకాలోని బీసీ సంక్షేమశాఖ పరిధిలోని హాస్టల్‌లో హైస్కూల్ బాలురు, బాలికల నుంచి అర్జీలు ఆహ్వానిస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ అవదలచినవారు బీసీ 2ఏ, 2బీ, 3ఏ, 3బీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా అర్జీలు సమర్పించే వీలుంది. ఈనెల 10వరకు అవకాశం ఉంది. మరిన్ని వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 8050770004, 8050770005కు సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

నగలు, నగదు చోరీ

శిడ్లఘట్ట, జూలై 2: తాలూకాలోని జంగమకోటె గ్రామం లోని బీగాలు వేసిన ఇంట్లో దొంగలు పడ్డారు. బీగాలను పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దుండగులు సుమారు 4 లక్షల రూపాయల విలువైన నగలు చోరీ చేశారు. నారాయణప్ప ఫిర్యాదుతో గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఒక కంఠహారం, రెండు పిల్లల ఉంగరాలు, రెండు జతల కమ్మలు, రెండు నెక్లెస్‌లు, మాంగల్యం గొలుసు, రెండు వెండి పట్టీలు, ఇతరత్రా ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే

మహదేవపుర, జూలై 2: నియోజకవర్గంలో గత బీజేపీ సర్కారు అవధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టినట్టు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తెలిపారు. మంగళవారం పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సంబంధించి భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని బైరతి వార్డులోని వారణాసి, బైరతి గ్రామాలలో డ్రైనేజీ, కాడుగూడి వార్డులోని సాదరమంగళ, పటాలమ్మ లే అవుట్, కాడుగూడి, చన్నసంద్ర గ్రామాలలోని రోడ్డు, డ్రైనేజీ పనులను పూర్తి చేసేలా అధికారులకు ఆదేశించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యత పాటించాలని కంట్రాక్టర్లకు సూచించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ హోబళి అధ్యక్షుడు నటరాజ్, హరాడి పిళ్ళప్ప, వెంకటేశ్‌రెడ్డి, నారాయణస్వామి, పవన్‌కుమార్, రమేశ్, పవన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూలై 2: తుంగభద్ర జలాశయంలోకి ఇన్‌ఫ్లో రోజు రోజుకు పెరుగుతోంది. జలాశయంలోకి మం గళవారం 13,410 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 1585.87 అడుగుల నీటిమట్టం ఉండగా 7.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్ ఫ్లో 297 క్యూసెక్కులు ఉంది. దీంతో బొమ్మనహాళ్, కణేకల్లు ప్రాం తాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర జలాశ యంపై ఆధారపడిన రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరిస్తాం

మడకశిర టౌన్, జూలై 2: రాష్ట్రంలో రెండు పార్టీలు కేంద్రానికి మద్దతు ఇస్తున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడితే తాము కూడా సహకరిస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. 2029 ఎన్నికల తరువాత రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మడకశిరలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు బీజేపీకి లేకపోతే కేంద్రంలో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. వీరి మద్దతుతోనే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని కాపాడటానికి బలమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. ఈ నెల 6న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో సమావేశం కానున్నారని, ఆంధ్రప్రదేశ్ హక్కులను సాధించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదే మంచి తరుణమని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. మడకశిరలో ఆగిన రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయించాలని, హంద్రీనీవా కాలువ ద్వారా అన్ని చెరువులకు నీరు నింపాలని వారికి సూచించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా అందరి గొంతులు తడపాలని, పరిశ్రమల సాధన కోసం కృషి చేయాలని అన్నారు.

ప్రవేశాలకు వేళాయె..!

● డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం ● డిగ్రీకి ఈ నెల 10వరకు, ఇంజనీరింగ్‌కు 7వరకు రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, జూలై 2: ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకామ్, బీబీఏ, ఒకేషనల్ వంటి కోర్సులతో పాటు ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సుల ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 1 నుంచి 7వ తేదీవరకు, ఇం టర్ పూర్తిచేసిన విద్యార్థులు 10వరకు ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశాల ప్రక్రియను ప్రతిఏటా ఆలస్యంగా చేపట్టింది. దీంతో తరగతుల నిర్వహణ కాలపరిమితి కుదించి పరీక్షలు నిర్వహించేవారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల తిరగకముందే కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టడంపై హర్షం వ్యక్తం అవుతోంది.

ఇంజనీరింగ్‌లో...

జేఎన్‌టీయూ పరిధిలో దాదాపు 120కిపైగా అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. అనంతపురం, పులివెందుల, కలికిరి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఈఏపీసెట్ (ఎంపీసీ స్ట్రీమింగ్)లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల ఏడో తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అధికారులు పరిశీలిస్తారు. ఏదైనా లోపాలుంటే సంబంధిత విద్యార్థుల మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు పంపుతారు. 8నుంచి 12 తేదీవరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. ఆప్షన్లు ఇచ్చుకున్న కళాశాలలను 13న మార్పు(స్లైడింగ్) చేసుకునే వెసులు బాటును కల్పించారు. అనంతరం 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో 22లోపు రిపోర్ట్ చేసుకోవాలి. 19నుం చి కళాశాలల తరగతులు ప్రారంభం కానున్నాయి. http-s://eapcetsche.aptonline.in/EAPCET/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సమస్యల పరిష్కారాలకోసం జేఎన్‌టీయూ హె ల్ప్‌లైన్ సెంటర్ 08554-272450, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 7901620145 నెంబర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలలోపు సంప్రదించాలని అధికారులు సూచించారు.

డిగ్రీ ప్రవేశాలకు...

ఎస్కేయూ పరిధిలో 13 ప్రభుత్వ, 74 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల పదో తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల ఐదో తేదీ నుంచే పరిశీలిస్తారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 11నుంచి 15వరకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలల ఎంపిక చేసుకోవాలి. ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి 19న సీట్లను కేటాయిస్తారు. సీట్ పొందిన విద్యార్థులు 20 నుంచి 22వరకు సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం తరగతులు ప్రారంభం కానున్నాయి. https://oamdcapsche.aptonline.in/OAMDC202425/Inde వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు ఆర్ట్స్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 8897841984 నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సూచించారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్

డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కేటగిరి వారిగా ఓసీ రూ.400, బీసీ రూ.300, ఎస్సీఎస్టీ రూ.200ల చొప్పున ఆన్‌లైన్ ద్వారానే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రైవేట్ ఇంటర్నెట్ సెంటర్లలోకి వెళితే వీటికి అదనంగా ఒక్కక్కరికి దాదాపు రూ.300వరకు వసూలు చేస్తారు.